క్లుప్తంగా

నెట్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన



మైలవరం: బీకాం విద్యార్థులు నెట్ బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్ కార్డుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మైలవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి. వంశీకృష్ణ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు కామర్స్ రంగంలో ఉన్న ఉద్యోగావకాశాలను వివరించారు. కామర్స్ విభాగాధిపతి ఎం. శ్రీనివాసరావు, బోటనీ విభాగాధిపతి డాక్టర్ జి.రాముడు, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌కే కరీముల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన



ఇబ్రహీంపట్నం: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేయడంపై ఇబ్రహీంపట్నంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ చర్యను నిరసిస్తూ కొద్దిసేపు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి బేతపూడి కాంతారావు ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరావు, జయరాజు, పల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చనుబండ సెంటర్‌లో ట్రాఫికర్



చాట్రాయి: చనుబండ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. విజయవాడ–సత్తుపల్లి రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు రోడ్ల సెంటర్‌లో రోడ్డు పక్కనే ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. వ్యాపార దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతుండటంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో తప్పుకునేందుకు కూడా వీలుపడటం లేదని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మానసిక ఆరోగ్యంతోనే శారీరక ఆరోగ్యం ముడిపడి ఉంటుందని పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.పద్మావతి అన్నారు. వాసవ్య మహిళా మండలి, ది లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొండపల్లిలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు అవగాహన పెంచుకోవాలన్నారు. రెండు వారాలకు పైగా మానసిక అనారోగ్యం లక్షణాలు కనిపిస్తే అలాంటి వారిని సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకురావాలన్నారు. మానసిక అనారోగ్యానికి గురైన వ్యక్తుల పరిస్థితులను ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కేశవ వివరించారు. వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలు తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొందిన కేతనకొండ గ్రామానికి చెందిన వడకాపురపు లక్ష్మమ్మకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంగళవారం అందజేశారు. వైద్యశాలలో వైద్య చికిత్సలకు ఆమె ఖర్చు చేసిన రూ.63,632 చెక్కు ప్రభుత్వం మంజూరు చేయగా కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఆలయంలో డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

- మండుతున్న కూరగాయల ధరలు
- రూ.100కి రెండు రకాలు కూడా రాని వైనం
- ఆందోళనలో ప్రజలు



నూజివీడు: నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. ఒక పక్క పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా కూరగాయల ధరలు కూడా పెరుగుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల వరకు కిలో రూ.20కు లభించిన కూరగాయలు నేడు రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతున్నాయి. జేబునిండా డబ్బులతో మార్కెట్‌కు వెళితే సంచిలో సగానికి కూడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారులో ధరలే అదిరిపోతుండగా ప్రైవేటు కూరగాయల దుకాణాలు, గ్రామాలు, మండల కేంద్రాల్లోని కూరగాయల ధరలు మరింత తారెత్తిస్తున్నాయి. రైతుబజారు ధరల కంటే రెట్టింపు ధరలు ఉంటున్నాయి. పప్పులు, కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులతో కడుపు నింపుకుంటున్నారు. సొరకాయలు కొందామన్నా సైజుతో నిమిత్తం లేకుండా కాయ రూ.40లకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్డు రిటైల్‌లో రూ.7 అమ్ముతుండగా అట్ట రూ.200 అమ్ముతున్నారు. ధరల పెరుగుదలతో ప్రైవేటు ఉద్యోగాలు చేసే చిరుద్యోగులు ఇంటి బడ్జెట్ పెరిగి అప్పులు చేయాల్సి వస్తోంది.

కూరగాయలు కొనలేకపోతున్నాం



కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. గతంలో రూ.50కి రెండు నుంచి మూడు కిలోల వరకు కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు కిలో కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు ఇంతగా పెరిగినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు. రైతు బజార్లలోనే ఇంతింత ధరలుంటే బయట కొట్లలో మరింత మండుతున్నాయి.

– నంచి పద్మ, నూజివీడు

పచ్చడి మెతుకులే దిక్కు



కూరగాయల ధరలు మండుతుండటంతో పచ్చడి మెతుకులే దిక్కవుతున్నాయి. గతంలో కిలో కూరగాయలు వండుకునేవారం. ధరల పెరుగుదలతో ఆచితూచి వండుకోవాల్సి వస్తోంది. ఇటీవలి వరకు తక్కువగా ఉన్న కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో కిలోకు బదులుగా అర కిలో కొనుక్కొని సర్దుకుంటున్నాం. ఒకపూట కూరతో తింటే, ఇంకో పూట పచ్చడితో తింటున్నాం.

– పల్లెపాం సన్ని, చింతలవల్లి, ముసునూరు మండలం

కూరగాయల ధరలు (కిలో రూ.లలో)

	రైతు బజారు	బహిరంగ మార్కెట్
వంగ	44	60
టమోటా	60	75
బెండ	28	40
బీర	42	50
దోస	32	40
దొండ	40	50
గోరుచిక్కుడు	36	40
బంగాళాదుంపలు	43	50
కంద	64	70
క్యారెట్	50	60
చేమదుంప	40	50
సొరకాయ	28	40
పొట్లకాయ	28	40

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఆత్మ పీడీ నరసింహారావు
- గ్రామాల్లో పొలం పిలుస్తోంది

జి.కొండూరు: వరద ముంపునకు గురైన పంట పొలాల్లో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ యు. నరసింహారావు అన్నారు. మండల పరిధి వెంకటాపురం గ్రామ రైతు సేవా కేంద్రం ప్రాంగణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద మంపునకు గురైన వరి, పత్తి వంటి పైరులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ వరదల ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకి ప్రభుత్వం త్వరితగతిన పరిహారం అందించాలని కోరారు. మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల ప్రభావానికి జి.కొండూరు మండల పరిధిలో వరి 5,705 ఎకరాలు, పత్తి 3,567 ఎకరాలకు నష్టం వాటిల్లిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యరమల విజయశ్రీ, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ



వల్లంపట్లలో రైతులకు సూచనలిస్తున్న మాధవీలత

- పొందుగల(మైలవరం): రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ యు. నరసింహారావు అన్నారు. పొందుగల, మైలవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడా క్లోప్రిడ్ లేదా రీజెంట్ పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా రైతు సేవా కేంద్రాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లకు రిజిస్ట్రేషన్ జరుగుతోందని, రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ వి. హరినాథ్ మాట్లాడారు. ముందుగా క్షేత్ర సందర్శన చేసి వరి, పత్తి పంటలను పరిశీలించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని దాములూరు, చిలుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. మండల వ్యవసాయాధికారి డి.శైలజ మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. సాగుకు అవసరమైన వనరులు ఏవిధంగా సమకూర్చుకోవాలో తెలిపారు. పంట పొలాల్లో చేపట్టాల్సిన కలుపు నివారణ, ఎరువుల వినియోగం యాజమాన్య పద్ధతులు తెలిపారు. రైతుల సందేహాలు నివృత్తిచేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చెరుకుమల్లి మధుసూదనరావు, కరణం రంగారావు, ఏఏఓలు, రైతులు పాల్గొన్నారు.
- ఎ.కొండూరు: రైతులు భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ టి. మాధవీలత అన్నారు. వల్లంపట్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి యూరియా, పొటాష్ ఎరువులను దశలవారీగా వాడటం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. వరిలో సుడిదోమ నివారణకు వేపనూనెతో పాటు పైమెట్రోజెల్ 50 శాతం ఈసీని కలిపి వాడాలని, చివరి కోటా ఎరువులో తప్పనిసరిగా 15 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. తిరువూరు ఏడీఏ కెనడి మాట్లాడారు. ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో సుడి దోమ తెగులు

కాకర్ల(తిరువూరురూరల్): ఖరీఫ్ వరి పైరులో సుడిదోమ తెగులు సోకినందున రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మండలంలోని కాకర్లలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా దిగుబడి పెంచవచ్చన్నారు. రైతులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుని తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసుకోవచ్చన్నారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్

తిరువూరు: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక ప్రతిభ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాల బారిన పడవద్దని సూచించారు. విద్యా హక్కు చట్టాన్ని వివరించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు మోటారు వాహనాలను నడపడం నేరమన్నారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, కార్యదర్శి షేక్ గౌసుద్దీన్, న్యాయవాదులు మేకల నాగేంద్రప్రసాద్, సంకురాత్రి జనార్దనరావు, రాజవరపు శ్రీనివాసరావు, భూక్యా రాము, ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ



తిరువూరు: చిన్న పిల్లలు, కిశోర బాలికల్లో నులి పురుగుల నివారణకు బుధవారం అన్ని పాఠశాలల్లో మందులు పంపిణీ చేస్తున్నట్లు తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక యూపీహెచ్‌సీలో ఆల్బెండజోల్ మందులను వార్డు సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలకు ఈ మాత్రలు వేయడం వలన రక్తహీనత నివారిస్తుందని, శరీరంలో పోషకాలను గ్రహించే శక్తి పెరుగుతుందని ఆమె వివరించారు. తిరువూరు పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో మందులను పంపిణీ చేస్తారని వివరించారు.

స్వచ్ఛతా హీ సేవా

నూజివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని గొల్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ ప్రాణకోటి మనుగడకు ప్రతిబంధకంగా మారుతోందన్నారు. గ్రామంలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు, వీల్‌చైర్ అందజేత

విస్సన్నపేట: వాసవీ క్లబ్, వనితా క్లబ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రీజియన్ చైర్మన్ పర్యటనలో భాగంగా వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగుల సౌకర్యార్థం 30 దుప్పట్లు అందించారు. నాగులూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రవీణ్‌కు వీల్‌చైర్ అందజేశారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారులకు గొడుగులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీపీ భారతి

తిరువూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు కృషి చేయాలని తిరువూరు ఎంపీపీ గద్దల భారతి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. తహసీల్దార్ లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

విస్సన్నపేట: భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం పుట్రేల గ్రామ సచివాలయం –1 వద్ద ఏర్పాటు చేశామని ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి మంగళవారం తెలిపారు. వైద్య శిబిరం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. గిఫర్డ్ మెమోరియల్ హాస్పటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్న వారికి నూజివీడు అమెరికన్ హాస్పటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో 7 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 228 మంది విద్యార్థులకు హైస్కూల్ పూర్వ విద్యార్థి ఇలాసాగరపు లక్ష్మీనారాయణ సౌజన్యంతో వీటిని అందజేశారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, ప్రగతి స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కాలనీవాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న జగనన్న కాలనీ వాసులు, సీఐటీయూ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న కాలనీలో వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో బుడమేరు వరదకు కాలనీ ముంపునకు గురై 15 రోజుల పాటు నీటిలోనే కాలం వెళ్లదీశామన్నారు. అధికారులు ఇటువైపు కన్నెత్తిచూడలేదని, వీధి లైట్లు లేక చిమ్మ చీకట్లోనే కాలం గడిపామన్నారు. తాగునీరు, ఆహారం కోసం ఇబ్బందులు పడ్డామని తెలిపారు. వరద నష్ట పరిహారం కొందరికే రాశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ జగనన్న కాలనీ మొత్తం బుడమేరు నీటిముంపులో 15 రోజులు ఉందన్నారు. కొంతమందికి వరద నష్టపరిహారం నమోదు చేయలేదని విమర్శించారు. ఆధార్ మ్యాపింగ్ నమోదు కానందున పేర్లు నమోదు చేయలేమని అధికారులు చేతులెత్తేయడం అన్యాయమన్నారు. జగనన్న కాలనీ వాసులు అందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కోలాహలంగా బాలుర ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న గంపలగూడెం, పెనుగొలను హైస్కూల్ విద్యార్థులు

గంపలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాలుర ఆటల పోటీలు మంగళవారం గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోలాహలంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల స్థాయిలో ఎంపిక చేసిన జట్లకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి టీమ్‌లకు ఎంపిక చేశారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్, చెస్, ఖో–ఖో, యోగా పోటీలు రసవత్తరంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్, ప్రోగ్రాం కన్వీనర్ అంజియ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంపలగూడెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గంపలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 జూనియర్ ఆటల పోటీల్లో గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్‌ఎం బొల్లెపోగు కిరణ్ తెలిపారు. కబడ్డీలో జూనియర్ బాలికలు, ఖో–ఖో, వాలీబాల్ పోటీల్లో జూనియర్ బాలుర జట్లు ప్రథమ స్థానం పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ రాంబాబును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

- తిరువూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. 68వ స్కూల్ గేమ్స్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ చదల రామకృష్ణ, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరాజు ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని నిర్వాహకులు ప్రకటించారు.

ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలకు పాత్రికేయుల నిరసన



తిరువూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

తిరువూరు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విలేకరులను దూషించిన ఘటనను నిరసిస్తూ మంగళవారం తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవికి మెమోరాండం సమర్పించారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అక్రమాలపై వార్తలు రాసే విలేకరులను అసభ్య పదజాలంతో దూషించడం, బహిరంగంగా ఇష్టం వచ్చినట్లు తిట్టడం గర్హనీయమని పాత్రికేయులు పేర్కొన్నారు. వార్తలు రాసే విలేకరుల ఇళ్లకు వచ్చి కొడతానని, తాను సైగ చేస్తే తన అనుచరులు కూడా రెచ్చిపోతారని, ఎవరూ తనను ఏమీ చేయలేరని ఎమ్మెల్యే బహిరంగంగా దూషణకు పాల్పడటాన్ని తాము నిరసిస్తున్నట్లు పాత్రికేయులు ఆర్డీఓకు తెలిపారు. ఎమ్మెల్యే వైఖరిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎం ఖండన

ఎమ్మెల్యే శ్రీనివాసరావు విలేకరులను ఇష్టానుసారం తిట్టడాన్ని సీపీఎం సీనియర్ నేత ఎస్. నాగేశ్వరరెడ్డి ఖండించారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై వార్తలు రాసిన విలేకరులపై తన స్థాయిని మరచి ఎమ్మెల్యే దూషణలకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు.

సార్వత్రిక విద్య వరం లాంటిది

ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు



సార్వత్రిక విద్యపై మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బారావు

ముసునూరు: వివిధ కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలోనే మానేసిన విద్యార్థులు, గృహిణులు తిరిగి చదువుకునేందుకు సార్వత్రిక విద్య దోహదపడుతుందని, ఇది వారికి వరం లాంటిదని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు హైస్కూల్ ప్లస్‌లో వెలుగు మహిళా సమాఖ్య సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ దూర విద్యలో ప్రవేశాలు, అభ్యాసం తదితర విషయాలను వివరించారు. 14 ఏళ్ల వయస్సు కలిగి, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ టెన్త్, 16 ఏళ్లు నిండి, పదో తరగతి పాసైనవారు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించవచ్చన్నారు. ముసునూరు హైస్కూల్లో పదో తరగతి అభ్యసించేందుకు అవకాశముందని చెప్పారు. హెచ్‌ఎం సునీల, ఏపీఎం కుంటం బాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి.పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ డే

నూజివీడు: మొక్కలను మనం రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ డే ను పురస్కరించుకొని క్యాంపస్‌లోని వాలీబాల్ కోర్టు పరిసరాల్లో విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆడిటోరియం చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఏఓ బి. లక్ష్మణరావు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త శ్రావణి కనకకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

పీజీ కేంద్రంలో..

పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మార్ఏఆర్ కాలేజీ ఆఫ్ పీజీ కోర్సెస్‌లో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ డేను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో విద్యార్థులు ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ నవీన లావణ్యలత పాల్గొన్నారు.

కోతకు గురైన తాత్కాలిక వంతెన

ముసునూరు: ఇటీవల తూరలు వేసి, గ్రావెల్‌తో మరమ్మతులు చేసిన సంధ్యపు వాగు తాత్కాలిక వంతెన కోతకు గురైంది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి సంధ్యపు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చెక్కపల్లి–చింతలవల్లి మధ్య తాత్కాలిక తూరల వంతెన కోతకు గురికావడం ప్రారంభమైంది. నాలుగు అడుగుల మేర కోతకు గురై తూరలు బయటికి వచ్చాయి. వర్షం మళ్లీ వచ్చినా, అధికమైనా తూరలు కొట్టుకుపోయే పరిస్థితి తలెత్తడంతోపాటు మండల కేంద్రం, నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే రవాణా వ్యవస్థ దెబ్బ తింటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పొంగిన వాగు.. రాకపోకలకు అంతరాయం

ఆగిరిపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. గోపాలపురం, అడ్డ రోడ్డు వద్ద ఉన్న వాగు పొంగి రహదారిపై చేరుకోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్ఐ శుభశేఖర్ ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: స్థానిక రాజుపేటలో మంగళవారం మృతిచెందిన చిలుకూరి లలిత కుమారి నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్‌కు దానం చేశారు. లలితకుమారి కార్నియాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు సేకరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు కొమ్మినేని రాజేష్‌ఖన్నా, కంచర్ల ముత్యప్రసాద్, రాఘవరావు పాల్గొన్నారు.